సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



'అపార్'తో ఆపసోపాలు

అపార్ ఆపసోపాలు పెడుతోంది. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు తలలు పట్టుకుంటున్నారు.

- 8లో



పుస్తెలతాడు చోరీ

కవిటి రాజపురంలో ఓ మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ చేశారు. సాయంత్రం ఈ ఘటన జరిగింది.

- 8లో

స్పెషల్ బీఎడ్ పరీక్ష నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక బీఎడ్ మెంటల్లీ రిటార్డు పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎగ్జామినేషన్స్ పీజీ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ గురువారం చెప్పారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 11వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని సూచించారు. గడువు దాటితే రూ.100 అలస్య రుసుంతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని అన్నారు.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: శ్రీకాకుళం డివిజన్ పరిధిలో పలు 11 కేవీ ఫీడర్ల మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లుగా ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వర రావు తెలియజేశారు. ఈమేరకు కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో కనుగులవానిపేట, కళ్లేపల్లి, ఇప్పిలి, చల్లపేట సబ్‌స్టేషన్ పరిధిలో వప్పంగి, వాడాడ, కళింగపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో బందరువానిపేట, కళింగపట్నం, లోలుగు సబ్‌స్టేషన్ పరిధిలో లోలుగు, జి.సిగడాం సబ్‌స్టేషన్ పరిధిలో గెడ్డకంచరాం, రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో రావాడ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, మరమ్మతు పనులు పూర్తికాగానే సరఫరాను పునరుద్ధరిస్తామని ఈఈ యోగేశ్వర రావు తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బురిడికంచరాం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం సర్పంచ్ గంట్యాడ లక్ష్మి చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన సాధారణ నిధులతో పనులు సక్రమంగా చేయలేదని ఆ గ్రామానికి చెందిన వండాన మురళీ కలెక్టర్‌కు, డీపీఓకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు ఎంపీడీఓ మీసాల మన్మధరావు తెలిపారు. విచారణ మేరకు డీపీఓ సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కి వర్చువల్ విధానంలో శంకుస్థాపన



విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం: కొర్లాంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సీఎంతో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎస్ఈలు కృష్ణమూర్తి, వేణునాథబాబు, వెంకటరమణ, డీఈలు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురి కావద్దు: డీఐజీ



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టి

సోంపేట: సైబర్ నేరగాళ్ల ప్రలోభాలకు గురై మోసపోవద్దని డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. ఆయన ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డితో కలిసి గురువారం బారువ మెరైన్ పోలీస్ స్టేషన్, సోంపేట సర్కిల్ పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. కార్తీక వన భోజనాల దృష్ట్యా బారువ మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో గస్తీ పెంచాలన్నారు. అనంతరం సోంపేట సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. డీఐజీ గోపీనాథ్ మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సైబర్ నేరాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని చేసే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితో పంచుకోకూడదని, తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దని వివరించారు. మోసానికి గురైతే సమీపంలో పోలీస్ స్టేషన్‌కు లేదా 1930 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, గంజాయి రవాణా చేస్తూ దొరికితే చర్యలు తప్పవని అన్నారు. బాలికలను ప్రేమ పేరుతో మోసం చేస్తే 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు.

బీచ్ అభివృద్ధికి స్థల పరిశీలన

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ బీచ్ అభివృద్ధి కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ సీతారామయ్యతో కలిసి రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన చేశారు. గతంలో ప్రభుత్వం బీచ్ అభివృద్ధికి కేటాయించిన 5 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసి ఏపీ టూరిజం శాఖకు అప్పగించేందుకు రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీచ్ అభివృద్ధి కోసం స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ రికార్డు మేరకు స్థల కేటాయింపు వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని అన్నారు.

విశ్వ మిథ్యాలయం



- జీఆర్‌ఏయూలో రాజకీయ పెత్తనం
- కూటమి ప్రభుత్వం వచ్చాక గాడి తప్పిన పాలన
- నేతల సిఫార్సుల మేరకు నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు
- యూనివర్సిటీ పరిణామాలపై గవర్నర్ తదితరులకు ఫిర్యాదులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కాస్తా.. కూటమి నేతల మితిమీరిన జోక్యంతో విశ్వ 'మిథ్యా' లయంగా మారిపోతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వర్సిటీలో రాజకీయ జోక్యం అమాంతంగా పెరిగిపోయింది. నేతల సిఫార్సుల మేరకే పాలన సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు నడుస్తున్నాయి. నిధుల దుబారా, అడ్డగోలు నియామకాలతో విశ్వవిద్యాలయం విమర్శలకు గురవుతోంది. ఇక్కడ జరుగుతున్న అడ్డగోలు విధానాలపై గవర్నర్‌కు ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఫిర్యాదు చేసిన వ్యక్తులపై కక్ష సాధింపులు కూడా మొదలయ్యాయి.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

తన పదవిని కాపాడుకోవడానికి అధికార పార్టీ నేతలు చెప్పిన పనులన్నీ ఇక్కడ ఉన్నత స్థాయి అధికారులు చేసేస్తున్నారు. వారి సిఫార్సుల మేరకు నియామకాలు జరుగుతున్నాయి. కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఉద్యోగుల్ని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. వర్సిటీలో ఇటీవల 25 మంది సబ్జెక్టు కాంట్రాక్టర్‌లను నియమించారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల లేఖలు, సిఫార్సుల ఆధారంగా ఎంప్లాయిమెంట్ ఇచ్చారన్న విమర్శలు ఉన్నాయి. నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా ఉద్యోగ నియామకాలు చేస్తున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత అధికారిగా పనిచేసిన వారిని ప్రత్యేక అధికారిగా భారీగా జీతాలిచ్చి నియమించారు. విశ్రాంత ఉద్యోగిని నియమించి వసతి గృహంలో వసతి కల్పించారు. వసతి గృహం నుంచి భోజనం పంపిస్తున్నారు. ఎలాంటి ప్రకటనలు ఇవ్వకుండా ఒక ప్రత్యేక అధికారి, ఇద్దరు ఇంజినీర్లు, ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు, ఇద్దరు స్వీపర్లు, మరో ముగ్గురు విశ్రాంత ఉద్యోగులు, ముగ్గురు డ్రైవర్లను నియమించుకున్నారు. ఆర్థిక పరమైన, రహస్య పరమైన పోర్టుఫోలియోలు కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులకు ఇవ్వటానికి వీల్లేదు. అయినా నచ్చిన వారికి పోర్టుఫోలియోలు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. సామర్థ్యం కంటే వారికి అనుకూలమైన వారికి బాధ్యతలు ఇవ్వటం విమర్శలకు తావిస్తోంది. టెండర్ లేకుండా రూ. 22 లక్షలతో ఫర్నీచర్ కొనుగోలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా రూ.ఐదు లక్షలు దాటితే టెండర్ వేయాలి.

అడ్డగోలుగా తొలగింపు



ప్రభుత్వ జీఓ ఆధారంగా 12 మంది వర్సిటీలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు. అందులో తమకు కావాల్సిన వారిని నేతల సిఫార్సుల మేరకు ముగ్గుర్ని కొనసాగిస్తున్నారు. గతంలో నియమించిన 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పది నెలలుగా పనిచేస్తుండగా, ఆరు నెలల వేతనం అందజేశారు. టీడీపీ ఎమ్మెల్యే కూన రవి కుమార్ సిఫార్సు లేఖతో తొలగించే ప్రయత్నం చేశారు. వీరంతా లేబర్ కోర్టుకు వెళ్లటంతో తొలగింపు ప్రక్రియ ఆగడంతో పాటు ఐదు నెలల వేతనం అందుకున్నారు. పాలక మండలిలో ఈ అంశం పెట్టి తొలగించేందుకు ఆలోచన చేస్తున్నారు.

కార్లు దుబారా

ప్రస్తుతం వర్సిటీలో కార్లు దుబారా జరుగుతోంది. ఒక ఉన్నత స్థాయి అధికారి ప్రతి రోజూ విశాఖపట్నం నుంచి వర్సిటీకి ప్రభుత్వ కారులో రాకపోకలు సాగిస్తున్నారు. దీని డీజిల్ కోసం రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. మరో పక్క వర్సిటీకి నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఉంటున్నట్లుగా హెచ్ఆర్ఏ క్లెయిమ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రూ. 35 వేలు మించి వాహనం కోసం ఆయిల్ ఖర్చు దాట కూడదు. అయితే నిబంధనలు తనకు వర్తించవంటూ రూ.లక్షల్లో డీజిల్ కోసం ఖర్చు చేస్తున్నారు. గతంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సాయి బాబా ఈ అంశంపై ప్రశ్నించగా, ఆయనను విశ్రాంత ఉద్యోగి అంటూ తొలగించారు. మరో ఉన్నత స్థాయి వ్యక్తి తనకొక కారు, కుటుంబ సభ్యుల కోసం మరో కారు వినియోగిస్తున్నారు. ముఖ్యంగా తన మనవడిని పాఠశాలకు దించి తీసుకురావడానికి ప్రత్యేకంగా ఒక కారును వాడుతున్న పరిస్థితి కొన సాగుతోంది. వర్సిటీలో నాలుగు కార్లు ఉండగా ఇవి సరిపోవని రోజుకి రూ. 3500చొప్పున అద్దెకు ఒక కారును తీసుకుని నిధులు దుబారా చేస్తున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

వర్సిటీలో అధికారులు విస్మరించిన ఒక వర్గం నుంచి ఉన్నత విద్యాశాఖ, గవర్నర్, ఉన్నత విద్యా మండలికి నిరంతరం ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఒక నాన్ టీచింగ్ వ్యక్తి మొత్తం వర్సిటీ పరిణామాలను తన పేరుతో పిర్యాదు చేయగా, ఆయనను పిలిచి వా ర్నింగ్ ఇచ్చారు. ఉద్యోగం నుంచి తొలగించే ప్రయ త్నం చేస్తున్నట్లు వర్సిటీలో ప్రచారం సాగుతోంది. నచ్చని వారిపై కక్ష కడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌లకు గౌరవమే లేకుండాపోయింది. ఇటీవల పాతటెక్కలి దళిత సర్పంచ్ తుంగాన సుశీల గ్రామ సచివాలయంలో ప్రజా ప్రతినిధి హోదాలో కూర్చునే కుర్చీని చెత్త బండిపై ఎక్కించి ఇంటికి పంపించారు. ఈ ఘటన మరువక ముందే అదే దళిత సర్పంచ్‌కు మరో అవమానం జరిగింది. ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న ప్రజా ప్రతినిధి అని కూడా చూడకుండా అటు అధికారులు, ఇటు కూటమి నాయకులు అడుగడుగునా అవమానిస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారని దళిత సర్పంచ్ తుంగాన సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. పాతటెక్కలిలో గురువారం ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా గురువారం నిర్వహించిన వేరుశనగ విత్తనాల పంపిణీలో ప్రొటోకాల్ ఉల్లంఘించారని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన తనను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామురాలిని చేయకుండా ఏ అర్హత లేని గ్రామస్థాయి కూటమి నాయకులతో కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గు చేటని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు కనీస గౌరవం కూడా లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు.



పానమట్టం మీద ఉన్న దీపాలు

ముక్కంటీ.. నీవే దిక్కంటి

- శ్రీముఖలింగంలో తేజస్సు కోల్పోతున్న రాతి విగ్రహాలు
- ఇష్టానుసారం దీపారాధనే కారణం
- పట్టించుకోని దేవదాయ, పురావస్తు శాఖ అధికారులు

జలుమూరు:

ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో అష్ట దిక్పాలకులు అసలు రూపం కోల్పోతున్నారు. పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అపురూప విగ్రహాలకు నష్టం వాటిల్లుతోంది. మధుకేశ్వరుడు కొలువైన ముఖలింగానికి కార్తీకంలో తండోపతండాలుగా భక్తులు వస్తుంటారు. ఇక్కడ పూజలు, దీపారాధనలు దేవదాయ శాఖ ఆధీనంలో నిర్వహిస్తారు. ఆలయ పర్యవేక్షణ మాత్రం పురావస్తు శాఖ చేతిలో ఉంది. ఇక్కడ కొలువైన పురాతన విగ్రహాలు పర్యవేక్షణ లోపం కారణంగా పాడైపోతున్నాయి. నిత్యం వందలాది మంది భక్తులు ఈ ఆలయం దర్శించుకోవడంతో పాటు పూజలు, అభిషేకాలు, ఏకవార అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి ధూప దీపాలు పెడుతుంటారు. అలాగే కుంకుమార్చనలు, పుష్పాలతో అలంకరణ చేస్తుంటారు. దీని వల్ల విగ్రహాలు యథా స్వరూపం కోల్పోవడంతోపాటు వాటి ఉనికికి కూడా ప్రమాదం వాటిల్లుతోంది.

సిబ్బందిని ఏర్పాటు చేస్తాం..

శ్రీముఖలింగం దేవాలయం అతి పురాతనమైనది. ఆలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాతోపాటు దేవదాయ శాఖ, అర్చకులు, భక్తులు అందరిపై ఉంది. పానమట్టాల మీద దీపాలు వెలిగించడం, పసుపు కుంకుమలు పోయడంతో విగ్రహాల యథాస్వరూపం దెబ్బ తింటోంది. అలా చేయకుండా నిత్యం పర్యవేక్షించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

– నవీన్, కన్జర్వేటివ్ అధికారి, విశాఖపట్నం, కేంద్ర పురావస్తు శాఖ

అష్ట దిక్పాలకులకు ప్రమాదం..

శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో కొలువైన అష్ట దిక్పాలకులైన ఇంద్రుడు, ఆగ్నేయేశ్వరుడు, హేమేశ్వరుడు, నైరుతేశ్వరుడు, వరుణేశ్వరుడు, వాయవేశ్వరుడు, కుబేరశ్వరుడు, ఈశాన్యేశ్వరుడి విగ్రహాల కాళ్ల వద్ద, పానమట్టాల మీద దీపాలు పెట్టడంతో రాను రాను ఈ విగ్రహాలు పాడైపోతున్నాయి. అలాగే సాక్షి గణపతి, చింతామణి గణపతి, కాలభైరవుడు తదితర విగ్రహాలు వద్ద దీపాలంకరణల వల్ల రాతి విగ్రహాలు క్షీణ దశకు చేరుకుంటున్నాయి. వాస్తవానికి పానమట్టం మీద దీపాలు పెట్టకూడదని అంటారు. కానీ కొందరు భక్తులు తెలియక ఇక్కడే దీపాలు పెడుతుండడంతో విగ్రహాలు తేజస్సు కోల్పోతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన దేవదాయ శాఖ కనీస చర్యలు చేపట్టడం లేదు. కేంద్ర పురావస్తు శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో విగ్రహాల తేజస్సుకు భంగం వాటిల్లుతోంది.



ధర్మాన నివాసంలో విజయ సాయిరెడ్డి



నిర్మాణంలో గల పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న విజయసాయిరెడ్డి

పార్టీ కార్యాలయం పరిశీలన

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళంలోని పెదపాడు పరిధిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయ సాయిరెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. అంతకుముందు మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు నివాసంలో ధర్మానతో కాసేపు మాట్లాడారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్, పార్టీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్, పార్టీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, గొండు కృష్ణమూర్తి, ఎన్ని ధనుంజయరావు, మామిడి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

బీమా పథకం వినియోగించుకోండి



కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం (పీఎన్ కాల నీ): రబీ సీజన్‌కు సంబంధించి ఉద్యాన పంటలైన జీడి పంటల బీమా పథకాన్ని గుర్తించామని ఇన్స్యూరెన్స్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పంటల బీమాను ఇఫ్‌కోకియా అనే కంపెనీకి ఇచ్చామని తెలిపారు. రూ.32వేలు వరకు పంటకు బీమా చేయడం జరుగుతుందనితెలిపారు. ఈ బీమా మొత్తం రూ.32000కు గాను రైతు చెల్లించాల్సిన వాటా రూ.1600 మాత్రమేనని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క జీడిమామిడి రైతు వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు డీఎం వెంకటేష్ 9440389005ను సంప్రదించాలని కోరారు.

పగలు తవ్వకం.. రాత్రి తరలింపు



అంబావల్లి గ్రామం వద్ద ట్రాక్టర్లతో ఇసుక పోగులు నిల్వ చేస్తున్న దృశ్యం



అంబావల్లి వద్ద రాత్రికి రాత్రే తరలించిన ఇసుక పోగులు

హిరమండలం: మండలంలోని వంశధార తీరాన్ని తెలుగు తమ్ముళ్లు గుల్ల చేసి పారేస్తున్నారు. ఉచిత ఇసుక వారికి అయాచిత లబ్ధిగా మారిపోయింది. ప్రభుత్వం ఉచితం అన్న మరుక్షణం ప్రతి గ్రామంలో కూటమి పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక అవసరాలకు ఇసుక తవ్వుకో వచ్చని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించేసరికి వంశధార నదిపై పడిపోయారు. ముఖ్యంగా పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో కూటమి నేతల పంట పండింది. రోజంతా ఇసుక తవ్వకాలు జరిపి.. సమీప తోటల్లో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా యంత్రాంగం అటువైపుగా చూడడం లేదు. ప్రధానంగా కొత్తూరు, హిరమండలం, జలుమూరు, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, నరసన్నపేట, గార మండలాల్లోని వంశధార నదీ తీర గ్రామాలు ఇసుక దందాకు కేంద్రాలుగా మారుతున్నాయి.

పొలాల్లో ప్రత్యేక దారులు..

హిరమండలం మండలంలోని భగీరథపురం, అంబావల్లి గ్రామాల్లో నదీ తీర ప్రాంతాల్లో పొలాల్లో ప్రత్యేక రహదారులను ఏర్పాటుచేసి నదిలోని ఇసుకను తోడేస్తున్నారు. అంబావల్లిలో సచివాలయం ఎదురుగా రహదారి పక్కనే డంపింగ్ చేస్తున్నారు. అయినా స్థానికంగా సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీనిపై స్థానిక తహసీల్దార్ హనుమంతురావు స్పందిస్తూ అక్రమంగా తవ్వకాలు చేపట్టి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు చేపడతామని, నదీ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేకంగా నిఘా పెడతామని తెలిపారు.

అనుమతి లేకుండా హాస్టళ్ల నిర్వహణ తగదు

కంచిలి: ప్రభుత్వం నుంచి అనుమతి లేనిదే బాల బాలికల హాస్టళ్లు నిర్వహించరాదని మిషన్ వాత్సల్య జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ డి.మధుర మీనాక్షి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం ఎస్. ప్రసాదరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దత్తత, అనధికార దత్తత గురించి వివరించారు. బాలల రక్షణ, బాల్యవివాహాల నిషేధం గురించి ప్రతి పంచాయతీలో బాల్యవివాహ నిరోధక, బాలల రక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతి నెల సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో 11–18 మధ్య వయసు గల బాలికలను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి హక్కులు, ఆరోగ్య జాగ్రత్తలు వివరించాలన్నారు.

కస్సుబుస్సుల ప్రయాణం



శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో సోంపేట బస్సు ఎక్కేందుకు కుమ్ములాట

- గణనీయంగా ఆర్టీసీ సర్వీసుల కుదింపు
- జిల్లాలో 50కుపైగా బస్సు సర్వీసులకు మంగళం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

కాశీబుగ్గ: ఆర్టీసీలో దూర ప్రాంత ప్రయాణాలకు కస్సు'బస్సు'లు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా సూపర్ లగ్జరీ, లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, ఎల్‌హెచ్, పల్లెవెలుగు వంటి బస్సులు కుదించి సర్వీసులు రద్దు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి జిల్లాలోని నాలుగు డిపోల్లో ఏకంగా యాభైకు పైగా బస్సులను రద్దు చేశారు.

- పలాస డిపో పరిధిలో ఆంధ్రా–ఒడిశా బోర్డర్‌లో ఒడిశాలోని గ్రామాలకు కలుపుతూ బస్సులు నడుస్తాయి. గత ప్రభుత్వ హయాంలో మొత్తం 84 బస్సులు ఉండగా ప్రస్తుతం 61 బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. మొత్తంగా 23 బస్సులను గుట్టు చప్పుడు కాకుండా రద్దు చేశారు. ఇందులో సూపర్ లగ్జరీ బస్సులు (భద్రాచలం, విజయవాడ) 7, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 14, పల్లె వెలుగులు 5 తగ్గించేశారు.
- టెక్కలి డిపోలో గత ప్రభుత్వం హయాంలో 54 బస్‌లు నడిచేవి. ఇప్పుడు 48 మాత్రమే నడుస్తున్నాయి. లగ్జరీలు, ఎక్స్‌ప్రెస్‌లు, ఎల్‌హెచ్, పల్లె వెలుగులు మొత్తంగా 6 బస్సులను రద్దు చేశారు.
- శ్రీకాకుళం–02 డిపోలోగత ప్రభుత్వ హయాంలో ఉన్నప్పుడు 105 బస్సులు నడిచేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం 90కు పరిమితమయ్యాయి. రద్దు చేసిన వాటిలో ఏసీ, లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగులు ఉన్నాయి.



బస్సుల రద్దుపై పలాసలో నిరసన తెలుపుతున్న డ్రైవర్‌లు, కండక్టర్లు, సిబ్బంది

14 బస్సులు మాత్రమే తగ్గాయి



పలాస ఆర్టీసీ డిపో నుంచి ప్రస్తుతం 70 బస్సులు సర్వీసులో ఉన్నాయి. గతంలో 84 బస్సులు ఉండటం వాస్తవమే. కోవిడ్ ప్రారంభం నుంచి తగ్గుతూ ఇప్పటి వరకు 14 బస్సులు మాత్రమే తగ్గాయి. ప్రస్తుతం విజయవాడ, భద్రాచలం లాంగ్ సర్వీసులు రెండు బస్సులు మాత్రం మా హయాంలో తగ్గించాం. ఇచ్ఛాపురం నుంచి విశాఖ 10 హైయర్ బస్సులు, పలాస-చాపర-విశాఖ, పలాస-గుణుపూర్ వంటి బస్సులు జనాదరణ లేక నిలిచిపోయాయి. ఆ స్థానంలో శ్రీకాకుళం-01 డిపో, విశాఖపట్నం డిపో వారు వేసుకున్నారు. పల్లె వెలుగులు మాత్రం అప్పుడు ఎన్ని ఉన్నాయో ఇప్పుడు అవే ఉన్నాయి.

– ఆర్.సీతారామనాయుడు, మేనేజర్, ఆర్టీసీ డిపో, పలాస

రద్దు చేస్తే ఎలా..?



ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 54 బస్సులను రద్దు చేశారు. అంటే అనేక సర్వీసులు అనేక రూట్లలో రద్దయినట్టే కదా. ఎంతమంది ఇబ్బందులు పడుతుంటారో ఒక్కసారి ఆలోచించండి. 54 బస్సుల డ్రైవర్ ఉద్యోగాలు, కండక్టర్ ఉద్యోగాలు వాటిని మెయింటెనెన్సు చేసే సిబ్బంది ఇలా అన్నింటిలోనూ కోత పడుతుంది. ఒక్క పలాస డిపోలో సుమారు 25 సర్వీసులు రద్దు కావడంతో 23 ప్రైవేటు సర్వీసులు పెరిగాయి. – పీడీ కుమార్, కార్యదర్శి, ఎంప్లాయీస్ యూనియన్ పలాస

- శ్రీకాకుళం–01 డిపోలో ప్రభుత్వ హయాంలో మొత్తం 103 బస్‌లు నడిచేవి. ఇప్పుడు 95 ఉన్నాయి.

అపార్‌తో ఆపసోపాలు



తరగతి గదిలో పాఠాలు వింటున్న 9వ తరగతి విద్యార్థులు

- రోజువారీ టార్గెట్లు ఇస్తూ ఒత్తిడికి గురి చేస్తున్న ప్రభుత్వం
- విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తప్పులు ఉంటే చిక్కులే
- ముప్పు తిప్పలు పెడుతున్న వెబ్‌పోర్టల్
- తలలు పట్టుకుంటున్న హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించేందుకు ఉద్దేశించిన అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్యక్రమం ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలను ముప్పుతిప్పలు పెడుతోంది. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్మీడియెట్) వరకు చదువుతున్న విద్యార్థులకు అపార్ పేరిట 12 అంకెలతో కూడిన ఐడెంటీ నెంబర్‌ను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రక్రియకు క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి.

అపార్ ఎందుకంటే..

జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 'వన్ నేషన్.. వన్ స్టూడెంట్' నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో కేటాయిస్తారు. కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న అందరికీ ఈ నంబర్ కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. దీని వల్ల భవిష్యత్తులో సదరు విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. అయితే ఇది జరగాలంటే మూడు రికార్డులలో ఒకే రకంగా సమాచారం ఉంటేనే సాధ్యపడుతుంది.

ఇవి తప్పనిసరి..

విద్యార్థి 1వ తరగతిలో చేరినప్పుడు అడ్మిషన్ రిజిస్టర్, యూడైస్‌లో ఆన్‌లైన్ చేసిన వివరాలు, ఆధార్ కార్డు ఈ మూడింటిలో ఏ చిన్న తప్పు లేకుండా ఉంటేనే అపార్ నెంబర్ జారీ అవుతుంది. ఇప్పుడిదే విద్యాసంస్థలను కుదిపేస్తోంది. మెజారిటీ విద్యార్థులకు ఏదో ఒక దాంట్లో తప్పిదం కనిపిస్తునే ఉంది. దీంతో అపార్ నమోదు ముందుకు సాగడంలేదు. మరోవైపు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్ ఎంలు, ప్రభుత్వ యాజమాన్య ప్రిన్సిపాళ్లకు రోజువారి టార్గెట్లను నిర్దేశిస్తూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారు. వారు ఉపాధ్యాయులు, లెక్చరర్లను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తున్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ నేరుగా సమీక్షిస్తుండటంతో తలలు పట్టుకుంటున్నారు. మరోపక్క ఆధార్‌కార్డులను సరిచేసుకునేందుకు తల్లిదండ్రులు తమ పనులన్నీ వదులుకుని ఆధార్ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యార్థులు సైతం తరగతులకు దూరమై తల్లిదండ్రుల వెంట కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



అపార్ వెబ్‌పోర్టల్



అపార్‌కార్డు నమూనా

ఆ రెండింటితోనే సమస్య..

ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన నామినల్ రోల్స్ పంపాల్సి ఉంది. 2025–మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి.. పరీక్ష ఫీజుల వసూళ్లు/చెల్లింపుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఓ వైపు సర్వర్ సమస్యలు, మరోవైపు తీవ్ర ఒత్తిడి. ఈ రెండింటి మధ్య సీఆర్పీలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, లెక్చరర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా 1వ తరగతిలో చేరే సమయంలో ఇంటి పేరు (సర్‌నేమ్)తో నమోదు చేసుకుంటారు. సదరు ఉపాధ్యాయులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆధార్‌కార్డుల తయారీ సమయంలో ఇంటి పేరు లేకుండా.. కేవలం ఒక అక్షరం (ఇనీషియల్)తో నమోదు చేశారు. అలాగే పుట్టిన తేదీ నాడు.. ఏదో ఒకటి వేసేశారు. ప్రస్తుతం ఈ రెండే ప్రధాన సమస్యగా పరిణమించాయి. ఆధార్ మార్పులు జరగాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. అయితే చాలా మంది పిల్లల కుటుంబాలలో ఆ నమోదు జరగలేదు. ఇప్పుడు చేయించడానికి కార్యాలయాల చుట్టూ ప్రదర్శనలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ మార్పులు అంత సులభంగా అయ్యేవి కావు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 2840 ఉండగా వీటిల్లో 3,21,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి వరకు 1.2 లక్షల మంది వరకు అపార్ కార్డులు జనరేట్ అయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన వారికి అనేక సమస్యల కారణంగా కార్డులు జనరేట్ కావడం లేదు.

సమస్యలు వాస్తవమే..

అపార్ నమోదును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతిరోజు సంబంధితశాఖ ఉన్నతాధికారులు సమీక్షిస్తుండటంతో హెచ్‌ఎంలను, ప్రిన్సిపాళ్లను క్షేత్రస్థాయిలో ఒత్తిడి చేయాల్సి వస్తోంది. విద్యార్థులకు సంబంధించి ఆధార్‌కార్డు, ఇతర రికార్డులలోని పేర్లలో అక్షర దోషాలు, పుట్టిన తేదీలకు మ్యాచ్ కాకపోవడంతో సమస్యలు ఉన్నమాట వాస్తవమే. అందుకే ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.

– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ,
– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి

ఉచిత విద్యుత్ నిలిపివేయడంపై నిరసన

బూర్జ: ఉచిత విద్యుత్‌ను నిలిపివేసి ఇకపై చార్జీలు చెల్లించాలనడం తగదంటూ బూర్జ గ్రామ ఎస్సీ, ఎస్టీలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 250 మంది ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 2014 నుంచి 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేశారని, 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా అందజేసిందని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యుత్ సిబ్బంది ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తుండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిల్లు కట్టకపోతే కనెక్షన్ తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



బూర్జలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దళితులు

10న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలు



తైక్వాండో పోటీలో కీడాకారులు (ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా ఈ నెల 10న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు 38వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ కూర్గీ, 13వ జిల్లా స్థాయి పూమ్ సే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాలురు, బాలికల విభాగాలలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపిక చేస్తామని తెలిపారు. 7 నుంచి 11 ఏళ్ల వయస్సు ఉన్న క్రీడాకారులే అర్హులని పేర్కొన్నారు. 2013 జనవరి 1 నుంచి 2017 డిసెంబర్ 31 మధ్య పుట్టిన వారు అర్హులని, వివరాలకు కోచ్‌లు గౌతమ్ (8919591487), నవీన్ (9000655520)లను సంప్రదించాలని కోరారు.

టీడీపీ నేతలకు కొమ్ముకాస్తారా?

- కొత్తూరు ఎస్‌ఐ తీరుపై వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు ఆగ్రహం

కొత్తూరు: మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీకి చెందిన రైతు అనంతరావుతో పాటు మరికొందరు గత టీడీపీ పాలనలో ఇళ్ల స్థలాలు, యూత్ ప్యాకేజీలు, అక్రమాలకు పాల్పడినట్లు అదే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావుకు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారుడు బూర్లె శ్రీనివాసరావు సమక్షంలో రీ సర్వే చేయాలంటూ తహశీల్దార్ రవిచంద్ర మండల సర్వేయర్‌ను ఆదేశించారు. దీని ప్రకారం మండల సర్వేయర్ గురువారం సర్వే చేపట్టగా.. అక్కడికి బూర్లె శ్రీనివాసరావును వెళ్లనీయకుండా స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావు అడ్డుకున్నారు. టీడీపీ నేతల మాటలకు తలొగ్గి పోలీస్‌స్టేషన్ వద్దే తనను ఉంచేశారని బూర్లె శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేసి విచారణ చేపట్టినప్పుడు వారిని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఒక మండల మెజిస్ట్రేట్ నోటీసును కాదన్న అధికారం ఎస్‌ఐకు లేదన్నారు. విచారణ సక్రమంగా జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.



మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో విచారణ చేపడుతున్న సర్వేయర్లు

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి

అరసవల్లి: విద్యుత్ చార్జీల పెంచుతూ కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. సర్దుబాటు చార్జీల పేరిట సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు, రైతులపై చార్జీల ప్రభావం దారుణంగా పడుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదారు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచడం తగదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలు చేయలేకే చార్జీల పెంచుతున్నారని దుయ్యబట్టారు. పార్టీ ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ డ్రామాలను ప్రజలకు ఇప్పటికే అర్థమయ్యాయని చెప్పారు. ఓ వైపు విద్యుత్ చార్జీలను పెంచేసి, మరోవైపు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తెంబూరు మధుసూదనరావు, నాయకులు ఆబోతుల వెంకట నాయుడు, బొత్స వెంకటరమణ, ఇజ్జురోతు రమణ, కొత్తకోట జోగి నాయుడు, మజ్జి మురళీమోహన్, దంత త్రినాథరావు, అంబటి దాలినాయుడు, మామిడి సత్యన్నారాయణ, గొల్లపల్లి దాలయ్య, గుంటబారిక అప్పారావు, పిసిని జనార్ధన, లోప్పింటి సీతయ్య, చిట్టిబారిక కృష్ణారావు, పాలవలస రమేష్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, విద్యుత్ కార్యాలయాల వద్ద సమ్మెలు, నిరసన కార్యక్రమాలను రద్దు చేస్తూ డిస్కం అధికారులు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యుత్ విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులు సంయుక్తంగా ఈ నిరసన కార్యక్రమాలను అడ్డుకున్నారు.



విద్యుత్‌కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక కచేరివీధి సాయిబాబా గుడి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గోపినాథపురం గ్రామానికి చెందిన బెండి ఆనందరావు ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా సాయిబాబాగుడి వద్దకు వచ్చే సరికి ఎదురుగా శాంభాన వీధికి చెందిన అశోక్‌వర్ధన్, నితిన్‌లు ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఆనందరావు కుడికాలు విరిగిపోగా, అశోక్‌వర్ధన్, నితిన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆనందరావును మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.



టెక్కలిలో చికిత్స పొందుతున్న ఆనందరావు

మున్సిపల్ టీచర్లకు పదోన్నతి కౌన్సెలింగ్ నేడు

శ్రీకాకుళం: జిల్లాలోని ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతి కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ, ఎల్‌పీ(తెలుగు) ఉపాధ్యాయుల జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పదోన్నతి కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9, ఆమదాలవలస, ఇచ్ఛాపురం పరిధిలో 9 ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్ల హవా

నరసన్నపేట : రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్–14 విభాగం పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలబాలికలు జట్లు సత్తా చాటాయి. 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం ములకల చెరువులో నిర్వహించారు.ఇందులో రెండు జట్లూ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. ఈ జట్లకు తారకేశ్వరరావు, సాయి, మధులు కోచ్‌లుగా వ్యవహరించారు. బాలుర జట్టుకు నరసన్నపేట మండలం గుండవల్లిపేట జ్యోతీరావు పూలే స్కూల్లో 8 రోజుల పాటు శిక్షణనిచ్చారు. బాలికల జట్టుకు నర్సీపట్నంలో కోచింగ్ ఇచ్చారు.



ప్రథమ స్థానంలో నిలిచిన బాలబాలికల జట్లు

రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుల వివాదం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ కళాశాల, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల మధ్య వివాదం నెలకొంది. ఆస్పత్రిలో 80 మంది, కళాశాలలో 28 మంది సెక్యూరిటీ ఉద్యోగులు ఒకే కాంట్రాక్టర్ వద్ద కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. పది రోజుల క్రితం సదరు కాంట్రాక్టర్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి ఆస్పత్రిలో, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని కళాశాలలో విధులు నిర్వహించేలా డ్యూటీలు వేశారు. దీంతో కళాశాల సెక్యూరిటీ గార్డులు తాము ఆస్పత్రిలో విధులు నిర్వహించబోమని స్పష్టం చేశారు. ఆస్పత్రిలోని సిబ్బంది కళాశాలలో విధులు నిర్వహించేందుకు రాగా వారిని అడ్డుకుంటున్నారు. వారం రోజులుగా ఈ వివాదం కొనసాగుతోంది. ఫలితంగా కళాశాల, ఆస్పత్రిల వద్ద సెక్యూరిటీ సేవలు నిలిచిపోయాయి. కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది రాజకీయ నాయకులను ఆశ్రయించి వివాదం కోసం చెప్పకుండా జీతాలు చెల్లించటం లేదని, జీతాలు పెంచటం లేదని చెప్పి వారితో కాంట్రాక్టర్‌కు ఫోన్లు చేయిస్తున్నట్లు సమాచారం. వివాదం ముదురుతున్నా కాంట్రాక్టర్ మాత్రం శ్రీకాకుళం రాకుండా అధికారుల ఫోన్లు ఎత్తకుండా తప్పించుకుంటున్నారు. వాస్తవానికి కోవిడ్ ముందు వరకు రొటేషన్ పద్ధతిన సిబ్బందికి డ్యూటీలు వేస్తుండేవారు. కోవిడ్ సమయంలో అప్పటి రిమ్స్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి కాంట్రాక్టర్‌కు లేఖ రాస్తూ ఆస్పత్రి సిబ్బంది కళాశాలకు రావడం వల్ల కోవిడ్ విస్తరించే అవకాశం ఉంటుందని 28 మందిని తమకు ప్రత్యేకంగా కేటాయించాలని కోరడంతో అప్పటి నుంచి ఆ సిబ్బంది అక్కడే ఉన్నారు. కోవిడ్ ముగిసి ఏళ్లు గడుస్తున్నా కళాశాల సెక్యూరిటీ సిబ్బంది మాత్రం ఆస్పత్రికి వచ్చేది లేదని, అలా వస్తే వ్యాధులు విద్యార్థులకు అంటుతాయని వితండ వాదన చేస్తున్నారు. ఇదే వాస్తవమైతే బోధన సిబ్బంది కూడా ఆస్పత్రిలో పనిచేసే కళాశాలకు వస్తున్నారు. వ్యాధులు ప్రబలడం నిజమైతే బోధన సిబ్బంది ద్వారా కూడా వ్యాపించే అవకాశం ఉంది. ఈ వివాదంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీల వద్ద ప్రస్తావించగా విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వివాదాన్ని కాంట్రాక్టర్ పరిష్కరించాలని, తాము జోక్యం చేసుకోలేమన్నారు. త్వరలోనే కాంట్రక్టర్‌తో, ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

రణస్థలం : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి సమీపంలో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీ ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయ్యింది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆటోలో ఒక్క డ్రైవర్ మాత్రమే ఉండటం, అతనికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆటోను ఢీకొట్టిన లారీ ఆగకుండా సుమారు 10 కిలోమీటర్లు వెళ్లడంతో పలువురు యువకులు వెంబడించి లావేరు మండలంలోని అదపాక వద్ద పట్టుకున్నారు. డ్రైవర్‌ను జె.ఆర్.పురం పోలీసులకు అప్పగించారు. ఈ ఆటో లావేరు మండలంలోని మురపాక గ్రామానికి చెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.



నుజ్జయిన ఆటో

పుస్తెలతాడు చోరీ

కవిటి: మండలంలోని రాజపురం గ్రామానికి చెందిన సనపల సుజాత అనే మహిళా రైతు మెడలోని పుస్తెలతాడును గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి తెంచుకు పోయాడు. దీంతో బాధితురాలు కవిటి పోలీసులను ఆశ్రయించింది. కవిటి రాజపురం కొజ్జిరియా(కేఆర్‌కే) రోడ్డుమార్గంలో వస్తుండగా రాజపురం సమీపంలో మలుపు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పెనుగులాటలో మంగళసూత్రం, పుస్తెలు తనచేతిలో ఉండిపోగా తులంపావు బరువైన పుస్తెలతాడు పట్టుకువెళ్లిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ రూప్‌కుమార్ కేసు నమోదు చేశారు.

10న రాష్ట్రస్థాయి చెస్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: నరసన్నపేటలోని ఎం.జె.పి.ఎ.పి. బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ వేదికగా ఈ నెల 10న జిల్లాస్థాయి అండర్–13 బాలబాలికల చెస్ ఎంపికలు జరుగుతాయని టోర్నమెంట్ డైరెక్టర్ సనపల భీమారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 21 వరకు తాడేపల్లిగూడెంలో జరగబోయే రాష్ట్రస్థాయి అండర్–13 పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జనన ధ్రువీకరణ పత్రం, రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 9912559735 నంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గార: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మానసిక వేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గార మండలం తోనంగి పంచాయతీ బచ్చువానిపేటకు చెందిన బచ్చు లక్ష్మణరావు (43) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. కుటుంబానికి భారంగా మారాననే ఉద్దేశంతో బుధవారం ఇంటివద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. భార్య బచ్చు రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆర్.జనార్దన తెలిపారు. లక్ష్మణరావుకు భార్యతో పాటు 9వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నాడు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్లు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 78 గంటల పాటు మార్చురీలో ఉంచుతామని, మృతుడి వివరాలు తెలియకపోతే అంత్యక్రియలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: గత నెల 28న ఎస్ఎంపురం రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొట్టిన ఘటనలో శ్రీనివాస్ అనే వ్యక్తి గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి తండ్రి అంధవరపు భీమరాజు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేడు రైల్వే గేటు మూసివేత

టెక్కలి: టెక్కలి గోపినాథపురం వద్ద శుక్రవారం రైల్వే గేటును మూసివేస్తున్నట్లు పీడబ్ల్యూఐ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వై.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు గేటు మూసివేసి ట్రాక్ మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాహన చోదకులు, స్థానికులు సహకరించాలని కోరారు.

11న జాబ్‌మేళా

నరసన్నపేట: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.లత ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ విద్యార్హత కలిగిన 18 నుంచి 35ఏళ్లలోపు నిరుద్యోగ యువకులు అర్హులని పేర్కొన్నారు. నవతా ట్రాన్సపోర్టు, పేటీఎం, స్పందన స్ఫూర్తి కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వివరించారు. పూర్తి వివరాలకు 99499 00672 నంబరుకు ఫోను చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

యోగా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం యోగా హాలులో గురువారం అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే యోగా క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. 30 మంది క్రీడాకారులు హాజరు కాగా యు.కృపారాణి, డి.రూపప్రియాంక, కె.సాయిసుధ, సీహెచ్ శిరీష, ఎస్.గణేష్, బి.రవీంద్ర, బి.శివసాయి, డి.స్వర్ణరాజ్, ఎస్.భాస్కర్‌రావులను ఎంపిక చేశారు. వీరికి డిసెంబర్ 26 వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల పోటీలకు పంపిస్తారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ యోగా శిక్షకులు ఈశ్వర్, స్పోర్ట్సు డీన్ రవికుమార్, అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్



సీసీ కెమెరాకు చిక్కిన దుండగులు

రణస్థలం: మండలంలోని కోష్ట జంక్షన్‌లో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి రోడ్డుపై అటూ ఇటూ సంచరిస్తూ పలు షాపుల్లోనికి ప్రవేశించేందుకు విఫలయత్నం చేశారు. ఓ షాపులోకి ప్రవేశిస్తుండగా వాహనాల అలజడితో పరారయ్యారు. ఈ దృశ్యాలన్నీ ఓ వస్త్ర దుకాణదారుడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. రణస్థలం పరిసర ప్రాంతాల్లో రాత్రివేళల్లో దొంగల బెడద ఎక్కువగా ఉన్నందున పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత

రణస్థలం: పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని జె.ఆర్.పురం మండల కేంద్రం వద్ద పోలీసులు పట్టుకున్నారు. నరసన్నపేట మండలం కిలారి గ్రామం నుంచి విశాఖపట్నం వీటిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులను స్వాధీనం చేసుకుని కొత్తవలస గోశాలకు తరలించి వ్యాన్ సీజ్ చేశామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఎల్‌ఎల్‌బీ కోర్సులో 39 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో చేరేందుకు గురువారం 39 మంది విద్యార్థులు రిపోర్టు చేశారు. ప్రవేశాలకు శుక్రవారం సాయంత్రం వరకు గడువు ఉంది. 66 సీట్లు ఉండగా 65 మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారు. త్వరలోనే క్లాస్‌వర్కు ప్రారంభిస్తామని కోర్సు కోఆర్డినేటర్ వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల కార్మికులకు విముక్తి కల్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదామని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ రోడ్డులో పలు షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని షాపు యజమానులకు సూచించారు. కార్యక్రమంలో కార్మిక అధికారి శ్రీనివాసరావు, జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.